

గుంటూరు,డిసెంబర్ 8 (యదార్థవాది) 'ఏపీకి సైకో పాలన వద్దు.. సైకిల్ పాలన ముద్దు' అని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను ఎదుర్కోలేక సంగం డెయిరీపై అక్రమ కేసులు పెట్టారని దుయ్యబట్టారు. 'సీఎం జగన్ కి సంఘం వద్దు.. అమూల్ ముద్దు. సంఘం రైతుల సంస్థ.. అమూల్ గుజరాత్ సంస్థ' అని చంద్రబాబు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత జగన్‌రెడ్డికి బీసీలు గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. విజయవాడ వైసీపీ సభకు బీసీలను బలవంతంగా తీసుకొచ్చారని, వైసీపీ సభకు రాకపోతే ప్రభుత్వ పథకాలు కట్ చేస్తామని బెదిరించారని, టీడీపీ సభలకు జనం స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని తెలిపారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని, జగన్‌రెడ్డి తోకను త్వరలోనే కట్ చేస్తామని చంద్రబాబు హెచ్చరించారు.

## మెట్రోను ప్రారంభించే... అర్హత కేసీఆర్‌కు లేదు

మొదటిపేజీ తరువాయి..
ప్రశ్నించారు. 8 సంవత్సరాలలో రూ. 800 కోట్ల ప్రాజెక్టును పూర్తి చేయటానికి సహకరించని కేసీఆర్, రూ. 6,250 కోట్ల ప్రాజెక్టును మూడు సంవత్సరాలలో పూర్తి చేస్తానంటే ప్రజలు నమ్మాలా అని కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ బూటకపు వాగ్దానాలన్నీ ముందస్తు ఎన్నికల ప్రణాళికలో భాగమే అని, అందుకే కేసీఆర్ ఫాం హౌస్‌ను వదిలి జిల్లాల పర్యటన చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## సజ్జల వ్యాఖ్యలపై షర్మిల ఫైర్

మొదటిపేజీ తరువాయి..
వాస్తవం అని, ఎంతోమంది బలిదానాలు, ఎంతోమంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. రెండు రాష్ట్రాలూ కలవడం అసాధ్యం అని షర్మిల స్పష్టం చేశారు. కొన్ని ఘటనలు చరిత్రలో ఒకేసారి జరుగుతాయి. విభజిత రాష్ట్రాలను మళ్లీ ఎలా కలుపుతారని ప్రశ్నించారు. మీరు ధ్యాస పెట్టాల్సింది రెండు రాష్ట్రాలను కలపడం మీద కాదు. మీ ప్రాంత అభివృద్ధి మీద ధ్యాస పెట్టాలి. మీ హక్కుల కోసం పోరాటం చేయండి, మీ ప్రాంతానికి న్యాయం చేయండి. అంతేకానీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడడం మీకు తగదు అని సజ్జలకు హితవు పలికారు.

## తాసిల్దార్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి..
సమాచారం అందించారు. ఇటీవలే ఈ మధ్యకాలంలో పెద్దబయలు తాసిల్దారిగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈనెల 5న పాడేరు ఐ టి డి ఏ లో జరిగిన సమావేశంలో పిఓ గోపాలకృష్ణ తాసిల్దార్ శ్రీనివాసరావును తిట్టడంతో బాధపడుతూ ఉండేవారని పెదబయలు రెవిన్యూ సిబ్బంది ఆరోపించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## పీర్జాదిగూడలో... సమాధుల కబ్జాలు



మొదటిపేజీ తరువాయి..
వద్దకు వెళ్లి పూర్వీకులను తలుచుకుంటూ ప్రార్థనలు చేసే ఆచారం అనాదిగా వస్తున్నది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ లో క్రిస్టియన్ ముస్లిం సమాధులపై గోడలు నిర్మించి క్రిస్టియన్స్ మతస్తుల సమాధులను దర్శించకుండా ప్రహరీ గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేసి ప్రార్థనలు చేయకుండా అడ్డుకుంటు వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని క్రిస్టియన్లు, చార్లెస్ ఆరోపిస్తున్నారు.సంవత్సరాలుగా స్మశానాలను కబ్జా చేసి స్మశానాల మీదనే ఇల్లు నిర్మించుకొన్న కబ్జారాయిల్లు. సంవత్సరాలు గడుస్తున్న సమస్య ఒక కొలిక్కి రాకపోవడంతో క్రిస్టియన్ పండుగ రావడంతో కనీసం ఒక్క సమాధి అయినా ఉందో లేదో అని చూసుకుందామని విచారకరంగా పూర్వీకుల సమాధులు చూసుకుందామని పూర్వీకుల సమాధి తాలూకు కొడుకు, కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్తే పూర్తిగా సమాధుల పైనే ఇల్లు కట్టుకున్నారని ఏడుస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా ఆటవిక సమాజానంగా మారింది. ఎక్కడో మారుమూల ప్రదేశంలో ఈ రకమైన అన్యాయం జరిగిందంటే ఒక అర్థం ఉంటుంది. నగరం నడిబొడ్డున ఇంత ఆటవికంగా జరుగుతున్న పరిణామాలను తలుచుకుంటూ, చూస్తూ ఏడుస్తూ ఉంటే పలువురి హృదయం ద్రవించి పోయింది. ఈ తప్పులను ఎవరు భరిస్తారు, ప్రభుత్వమా....? పురపాలక శాఖ మంత్రి కేటీఆరా,రెవెన్యూ అధికారులా, ఎవరు ఎవరు సమాధానం చెప్తారు..? బాధితులు వారి ఆవేదనను తీవ్ర స్థాయిలో వెళ్ళగకుతున్నారు. మల్లొకసారి ప్రజా సంఘాలను, రాజకీయ నాయకులను,కుల సంఘాలను, క్రిస్టియన్ మైనార్టీ సంఘాలను, కలిసి వచ్చే ప్రతి ఒక్కరిని కలుపుకొని పెద్ద ఎత్తున మద్దతు కూడ కూడగట్టుకుని ముందుకు తీసుకువెళ్తామని చార్లెస్ అన్నాడు. అప్పుడు గాని పూర్వీకులకు మనశ్శాంతి కలగదని ఆయన అన్నారు. క్రిస్టియన్ సమాధి వద్ద పాలతో కడిగి, పూలతో అలంకరించి క్యాండిల్ వెలిగించి ప్రార్థనలు చేశామని ఆయన అన్నారు.





# వ్యవసాయానికి 24 గంటల కరెంట్.. నిరూపిస్తే రాజకీయ సన్యాసం

జగిత్యాల,డిసెంబర్ 8 (యదార్థవాది) తెలంగాణలో కూడా గుజరాత్ ఫలితమే పునరావృత మవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అవినీతి ప్రభుత్వం ఓడిపోక తప్పదని చెప్పారు. అభివృద్ధి చేసే వాళ్లే గెలుస్తారన్న బండి సంజయ్.. అవినీతిపరులు పడిపోతారని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట్ విడిది నుండి బండి సంజయ్ 'ప్రజా సంగ్రామ యాత్ర' మొదలైంది. సిర్పూర్, నడికుడ, రాఘవపేట, హుస్సేన్ నగర్, ముత్యంపేట్ మీదుగా వేంపేట్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుండగా వెంపెట్ సమీపంలో బండి సంజయ్ రాత్రి బస చేయనున్నారు. మొత్తం12.6 కిలోమీటర్ల మేర బండి సంజయ్ పాదయాత్ర కొనసాగనుంది. పదేపదే మోటర్లకు మీటర్లు అంటూ టీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను కొట్టిపారేశారు. మోటార్లకు మీటర్లు పెడితే తానే బాధ్యత వహిస్తానని బండి సంజయ్ అన్నారు. లేని పక్షంలో సీఎం కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతికే



మీటర్లు పెట్టామని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. నిరూపించకపోతే రాజకీయ సన్యాసం తీసుకునేందుకు కేసీఆర్ సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. రూ.60 వేల కోట్ల బకాయిలతో డిస్కంలను సంక్షోభంలోకి నెట్టిన సీఎం. కరెంట్ ఛార్జీల పెంపుతో జనం నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. మైసూర్ పాక్, మైసూర్ బజ్జీ, ఇరానీ చాయ్ అక్కడి నుండే వస్తున్నాయా? అని ప్రశ్నించారు. మేకిన్ ఇండియా పేరుతో స్థానిక పరిశ్రమల నుండే చైనా బజార్లకు వస్తువులు వెళుతున్నాయని చెప్పారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోతే ఉరేసుకుంటానన్న ఎమ్మెల్యే ఎటుపోయిండని బండి సంజయ్ ప్రశ్నించారు. రూ.250 కోట్లతో షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు డబ్బులివ్వరా అని అడిగారు. లక్ష కోట్లతో దొంగ సారా దందా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాన్ని ఒప్పించి రూ.250 కోట్లతో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తానన్న హామీ ఏమైందని అడిగారు. గల్ఫ్ బాధితుల శవాలను కూడా తీసుకురాలేని అసమర్థులు అంటూ విమర్శలు చేశారు. వేములవాడ రాజన్న, బాసర సరస్వతి ఆలయాలకు వందల కోట్ల మంజూరు హామీ ఏమైందని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. మళ్లీ కొండగట్టు అంజన్న పేరుతో దేవుళ్లకే శఠగోపం పెడతున్నారని ఆరోపించారు. బీడీ కార్మికుల బాధలెందుకు పట్టించుకోవడం లేదన్నారు. పెన్షన్లకు కటాఫ్ డేట్ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్న నిధులన్నీ కేంద్రానివే అని బండి సంజయ్ చెప్పారు.

## అభివృద్ధి రాజకీయాలను... ప్రజలు ఆశీర్వదించారు

మొదటిపేజీ తరువాయి..
ను మట్టికరిపించింది. కాంగ్రెస్ పార్టీకి 17 స్థానాలు దక్కగా, తొలిసారి గుజరాత్ బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీ 5 స్థానాలు చేజిక్కించుకుంది. ఇతరులు 4 స్థానాల్లో నెగ్గారు. గుజరాత్ అసెంబ్లీ బరిలో బీజేపీ నెగ్గడం ఇది వరుసగా ఏడోసారి. 1995 నుంచి కమలనాథులు ఇక్కడ ఎదురులేని ప్రస్థానం కొనసాగిస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల సొంత రాష్ట్రం కావడంతో గుజరాత్ ఎన్నికలను బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే, పంజాబ్ లో సంచలన విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ బరిలో దిగడంతో ఓట్లు చీలే అవకాశం ఉంటుందని, బీజేపీకి నష్టం జరగొచ్చని అంచనా వేశారు. అయితే, అంచనాలను తల్లకిందులు చేస్తూ బీజేపీ భారీ సంఖ్యలో సీట్లను గెలుచుకుని మరోసారి ప్రభుత్వ పీఠాన్ని ఖాయం చేసుకుంది. గతంలో వరుసగా ఏడు సార్లు నెగ్గిన ఘనత సీపీఎం పార్టీకి ఉంది. పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ వరుసగా 7 పర్యాయాలు అధికారం చేజిక్కించుకుంది. ఇప్పుడా రికార్డును బీజేపీ సమం చేసింది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలు ఉండగా, మ్యాజిక్ ఫిగర్ 92. అయితే మ్యాజిక్ ఫిగర్ ను మధ్యాహ్నానికే దాటేసిన కాషాయదళం... సాయంత్రానికి 150కి పైగా స్థానాలతో జయకేతనం ఎగురవేసింది. అటు, హిమాచల్ ప్రదేశ్ లో అధికార బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజేతగా అవతరించింది. ఈ సాయంత్రానికి ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, కాంగ్రెస్ 40 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీకి 25, ఇతరులకు 3 స్థానాలు దక్కాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కస్థానం కూడా నెగ్గలేకపోయింది. ఇక్కడి అసెంబ్లీలో మొత్తం స్థానాల సంఖ్య 68. హిమాచల్ ప్రదేశ్ లో 1985 నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వాన్ని మార్చడం ఓటర్లకు ఆనవాయతీగా వస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు ఏ పార్టీ కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. గత ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన ప్రజలు, ఈసారి కాంగ్రెస్ కు పట్టం కట్టారు.

## సమైఖ్య రాష్ట్రం కోసం ఎలాంటి పోరాటమైనా చేస్తాం

- ఏ వేదికనైనా పంచుకునేందుకు సిద్ధం
- విభజనను ముందునుంచీ వ్యతిరేకించింది తామే
- విభజన పాపానికి కాంగ్రెస్, బిజెపి, టిడిపి బాధ్యులు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల సంచలన వ్యాఖ్యలు

అమరావతి,డిసెంబర్8 (యదార్థవాది): ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సమైక్య రాష్ట్రం కోసం మరోమారు ఎలాంటి కార్యక్రమానికైనా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందిన సజ్జల అన్నారు. కుదిరితే మళ్లీ ఏపీ ఉమ్మడిగా కలసి ఉండాలన్నదే తమ విధానం అని అన్నారు. ఎపి విడిపోకుండా చివరి వరకు పోరాడిరది కూడా తామేనని, జగన్ ఇందుకు చివరి వరకు కట్టుబడి ఉన్నారని అన్నారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన సజ్జల.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తీరు, సుప్రీంకోర్టులో కేసుపై ఉండవల్లి అరుణ్ కుమార్ చేసిన విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సీఎం జగన్‌పై కావాలనే ఆయన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం జగన్ ఎప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. అందుకోసం వచ్చిన ఏ అవకాశాన్నీ మేం వదులుకోబోమని అన్నారు. ఏ వేదిక నుంచైనా ఇకముందు తాము గట్టిగా నిబదతామని కూడా అన్నారు. సమైక్య రాష్ట్రాన్ని వైసీపీనే గట్టిగా కోరుకుందని గుర్తు చేశారు. తాము ఎప్పుడూ ఉమ్మడి రాష్ట్రానికే మద్దతు ఇస్తామన్నారు. కుదిరితే మళ్లీ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా కలిసి ఉండాలన్నదే తమ విధానం అని సజ్జల స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ కలవడానికి ఏ వేదిక దొరికినా తమ పార్టీ, తమ ప్రభుత్వం దానికే ఓటు వేస్తుందని ప్రకటించారు. కానీ, ఇప్పుడది సాధ్యమయ్యే పనేనా అని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్యలు అసందర్భంగా ఉన్నాయని, కావాలనే సీఎం జగన్‌పై ఆయన కామెంట్స్ చేశారని రామకృష్ణా రెడ్డి మండిపడ్డారు. ఇదిలాఉండగా.. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్.. ఏపీ సీఎం జగన్‌పై షాకింగ్ కామెంట్స్ చేశారు. విభజన గురించి వదిలేయండని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందంటూ ఆరోపించారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ అఫడవిట్ వేశారంటూ ఫైర్ అయ్యారు. ఏపీకి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడటానికి జగన్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. పోరాటం చేసే జగన్ ముఖ్యమంత్రి అయ్యారని, ఇప్పుడు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఏపీ కోసం పోరాటం చేయకపోతే జగన్ రాజకీయ జీవితం ఇంతటితో ముగిసినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా గురువారంసజ్జల మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్ ఆధారంగా తిరిగి రెండు రాష్ట్రాలు కలిపి ఉంచాలనే పరిస్థితి సుప్రీంకోర్టులో వస్తే దాన్ని వైసీపీ స్వాగతిస్తుందన్నారు. విభజనకు వ్యతిరేకంగా కోర్టుల్లో తమ వాదనలు బలంగా వినిపిస్తామన్నారు. రాష్ట్ర విభజనను పునఃసమీ క్షించాలి.. లేదా సరిదిద్దాలని కోరతామన్నారు. విభజన జరిగిన తీరుపైనే కేసు వేశారని, హామీల అమలు కోసం కాదని.. విభజన హామీల అమలు కోసం ఏపీ ప్రభుత్వం పోరాడుతోందని సజ్జల స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలు కలిసే అవకాశాన్నీ ఏపీ సర్కార్ ఉపయోగించుకుంటుందని, ఇరు రాష్ట్రాలు కలిసుండాలని సుప్రీం కోర్టు ఆదేశిస్తే అంతకంటే కావాల్సిందేముందన్నారు. అప్పట్లో టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ విభజనకు అనుకూలంగా వ్యవహరించాయని విమర్శించారు. వారే విభజన దోషులని అన్నారు. కానీ జగన్ చివరి వరకు విబజనకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. తిరిగి రెండు రాష్ట్రాలు కలిసేదాని కోసం వైసీపీ పోరాడుతోందని మరోసారి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

## నిర్విఘ్నంగా అన్నప్రసాద వితరణ సాగాలి

**అన్నప్రసాద భవనంలో సామాగ్రికి పూజలు**

తిరుమల,డిసెంబర్8 (యదార్థవాది): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నిర్విఘ్నంగా అన్నప్రసాద వితరణ జరగాలని ప్రార్థిస్తూ గురువారం ఆయుధపూజ నిర్వహించారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాల తయారీకి వినియోగించే సామగ్రికి, యంత్రాలకు పూజలు చేసినట్టు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. నిత్యం వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతున్న క్రమంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని భగవంతుని ప్రార్థిస్తూ ప్రతి సంవత్సరం అన్నప్రసాద భవనంలో సాంప్రదాయబద్ధంగా ఆయుధపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. 1983లో అన్నదానం ప్రారంభమైందని , 2009లో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనం నిర్మించి రోజుకు దాదాపు 14 గంటల పాటు నిరంతరాయంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాదం డిప్యూటీ ఈవో సెల్వం, ప్రత్యేక అధికారి జి.ఎల్.ఎన్.శాస్త్రి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, విజివో బాల్ రెడ్డి, ఏఈవోలు గోపీనాథ్, గంగాధరం, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతుంది . నాలుగు కంపార్టుమెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.నిన్న స్వామివారిని 51,376 మంది భక్తులు దర్శించుకోగా 24,878 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి ఆదాయం రూ. 4.60 కోట్లు వచ్చిందని తెలిపారు.

## బీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదం

మొదటిపెజీ తరువాయి..
కేసీఆర్‌కు అధికారికంగా లేఖ అందింది. దీంతో పార్టీ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మారింది. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చాలని ఈ ఏడాది దసరా పర్వదినం రోజున ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పార్టీ తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన విషయం విదితమే. ఎట్టకేలకు కేసీఆర్ రాసిన లేఖపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. టీఆర్ఎస్‌ను భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. పార్టీ మార్పునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కేసీఆర్‌కు అధికారికంగా లేఖ అందింది. దీంతో పార్టీ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది అక్టోబర్ 5న దసరా శుభ ఘడియల్లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. దేశ ప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ తెలంగాణ సీఎం కేసీఆర్ నూతన జాతీయ పార్టీని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరునే భారత రాష్ట్ర సమితిగా మారుస్తూ తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ అధికారిక ప్రకటన చేశారు. టీఆర్ఎస్ పేరును మారుస్తూ దసరా రోజున నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు 283 మంది టీఆర్ఎస్ ప్రతినిధులు ఆ తీర్మానంపై సంతకం చేశారు. దీంతో 21 ఏండ్ల టీఆర్ఎస్ ప్రస్థానంలో మరో మలుపు చోటు చేసుకుంది. సుమారు 8 రా ష్ట్రాలకు చెందిన నేతలు కూడా టీఆర్ఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు అని కేసీఆర్ ఆ రోజున తీర్మాన ప్రతిని చదివి వినిపించారు.

## ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

**ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వ ఏర్పాట్లు**
**అధికారుల, ప్రజాప్రతినిధులతో మంత్రులు సమీక్ష**

హైదరాబాద్,డిసెంబర్8 (యదార్థవాది):ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి క్రిస్మస్ వేడుకల నిర్వహణ పై నగరంలోని ఎంఎల్‌సీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు అన్ని పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో సంతోషంగా జరుపుకుంటున్నారని అన్నారు. పేదలు కూడా క్రిస్మస్ ను సంతోషంగా జరుపుకోవాలనే ఆలోచనతో పేదలకు ప్రభుత్వం గిఫ్ట్ ప్యాక్‌లు (దుస్తులు) పంపిణీ చేస్తుందన్నారు. ఎల్‌బీ స్టేడియంలో జరిగే విందుకు సీఎం హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా ఒక్కో నియోజకవర్గ పరిధిలో ఎనిమిది ప్రాంతాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సహకారంతో చర్చి కమిటీ ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించి డిన్నర్, గిఫ్ట్ ప్యాక్ ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ప్రాంతానికి 500 చొప్పున గిఫ్ట్ ప్యాక్ లు, డిన్నర్ నిర్వహణ కోసం ఒక లక్ష రూపాయలు చొప్పున అందించనున్నట్లు వివరించారు. దీని కోసం నియోజకవర్గానికి ఒక ఒక ప్రత్యేక అధికారిని నియమించామని చెప్పారు. ఈ సమావేశంలో మండలి ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీలు స్టీఫెన్ సన్, సురభి వాణి దేవి, హసన్ జాఫ్రీ, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, కౌసర్ మొహినోద్దిన్, టీఎస్‌ఈడబ్ల్యూఐసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, క్రిస్టియన్ మైనారిటీ ్గ, నాన్స్ కార్పోరేషన్ ఎండీ కాంతి వెస్లీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన బడిపై కలెక్టర్ సమీక్ష




**సిద్దిపేట, డిసెంబర్ 8 (యదార్థవాది)** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో దుబ్బాక నియోజకవర్గంలో మన ఊరు మన బడి పథకం కింద కేటాయించిన పాఠశాలల హెచ్ ఎం, ఎస్ఎంఎసి చైర్మన్లు, ఎంఈవో, ఎంపిడిఒ, ఎపిఓ, ఇంజినీరింగ్ విభాగం ఏఈ, డిఈలు సర్పంచ్, కౌన్సిలర్లు, నిర్మాణ ఏజెన్సీలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి ఎలాంటి సదుపాయాలకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలను బాగుపర్చడానికి తీసుకువచ్చిన గొప్ప పథకం ఈ మన ఊరు మన బడి అన్నారు. జిల్లా మొత్తంలో దుబ్బాక నియోజకవర్గంలో మన ఊరు మన బడి పథక పనులు సరిగ్గా లేనందున అసహనం వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా డైనింగ్ హాల్ నిర్మాణం జరగట్లేదని హెచ్ ఎం లు అడగ్గా ప్రభుత్వ గైడ్ లెన్స్ ప్రకారం డైనింగ్ హాల్ నిర్మాణం చేస్తున్నారు కాని పిల్లలు ఎక్కువ మంది ఉన్నారని మార్చడం కుదరదు పిల్లల తరగతులు వారిగా భోజన సమాయాలను తయారు చేస్తాం అన్నారు. ఈ పథకం మీ పాఠశాలలకు కేటాయించినప్పుడే అన్ని పనులు పూర్తి చేసుకోవాలి కాని మళ్లీ విడతలో చేపిద్దాం అని ఆలోచన కూడా దరిదాపుల్లో రాకుండా పని చేసుకోవాలని హెచ్ ఏం లకి సూచించారు. మళ్లీ విడత సమావేశం లోపు దాదాపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇట్టి కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# షీటీం హ్యూమన్ ట్రాఫికింగ్ అవగాహన సదస్సు



**సిద్దిపేట, డిసెంబర్ 08 (యదార్థవాది)** మహిళా భద్రత విభాగము తెలంగాణ రాష్ట్ర పోలీసు ఆధ్వర్యంలో "లింగ వివక్షత రహిత సమాజం కోసం జాతీయ ఉద్యమం-2022"ను పురస్కరించుకొని 25 నవంబర్ 2022 నుండి 23 డిసెంబర్ 2022 వరకు పోలీస్ కమిషనర్ ఆదేశాల అనుసారం సిద్దిపేట షీటీం మరియు హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఎన్జీవో సూర్యప్రభ, చైల్డ్ కోఆర్డినేటర్ సుజాత, రేషమా, షీ టీమ్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులతో కలిసి సిద్దిపేట పట్టణంలో మహిళలకు పిల్లలకు ఉన్న రక్షణ చట్టాల గురించి సైబర్ నేరాల గురించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు జరిగింది.

# ఏయుతో గరుడ లైటిక్స్ ఎంఓయు



**విశాఖపట్నం, డిసెంబర్ 8 (యదార్థవాది) :** ఆంధ్ర విశ్వ విద్యాలయంతో గరుడ లైటిక్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయు ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా ఏయు బిసి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను ఏయూ రిజిస్టర్ ఆచార్య వి. కృష్ణమోహన్ గరుడ లైటిక్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ వి. ఎస్ ఎస్ కిరణ్లు సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే దిశగా వివిధ పరిశ్రమలతో కలిసిపని చేస్తున్నామన్నారు. విద్యార్థులు అభ్యాసకులుగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో డ్రోన్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని, పర్యవేక్షణ, నిర్వహణ సర్వే,ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయటం వంటి అంశాలలో డ్రోన్స్ వినియోగిస్తామన్నారు. డ్రోన్స్ శిక్షణ సమాచార విశ్లేషణ జరిపే జి ఐ ఎస్ రంగాలలో పనిచేస్తున్న రెండు సంస్థలతో వరుసగా అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఇటువంటి నూతన సాంకేతిక అంశాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఏయూ జరిపే ఎంవోయూలు అన్ని విద్యార్థుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

# ఘనంగా దత్త జయంతి వేడుకలు



**గోకవరం, డిసెంబరు 8 (యదార్థవాది) :** దత్తాత్రేయుని జన్మదినాన్ని మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతిగా జరుపుకుంటారని,ఇది పవిత్రమైన రోజుగా పరిగణించబడుతోందని, అత్రి మహాముని,మహా పతివ్రత అనసూయల సంతానమే దత్తాత్రేయుడు అని గోకవరంకు చెందిన శ్రీ సత్య ప్రేమ సాయి అనుగ్రహ శక్తిపీఠం వ్యవస్థాపకులు శ్రీ లలిత శివ సాయి గురు మాతాజీ తెలిపారు.గురువారం తెల్లవారు జాము నుంచే శక్తిపీఠంలో మాతాజీ ఆధ్వర్యంలో దత్తాత్రేయుడి స్వరూపంగా షిరిడీ సాయి బాబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రిమూర్తులు అంటే బ్రహ్మ, విష్ణు,పరమేశ్వరుల అంశలతో జన్మించిన అవతారమూర్తిని, దత్తాత్రేయుడు విష్ణువు అంశతో,చంద్రుడు బ్రహ్మ అంశతో, దుర్వాసుడు శివుని అంశతో జన్మించారని పురాణ కథనం చెబుతుందని తెలిపారు.చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వాముల వారికి కాయకర్పూ రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ,షిరిడీ సాయినాధునికి అభిషేకాలు, అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అశేష భక్తులు పాల్గొన్నారు.




## మంత్రి క్యాంపు కార్యాలయంలో

# అయ్యప్ప పడి పూజ..

### దీక్ష లో పాల్గొన్న మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, డిసెంబర్ 08 (యదార్థవాది)** అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం గురువారం సిద్దిపేట లోని మంత్రి హరీశ్ రావు క్యాంపు కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంకల్ప సిద్ధి గల ప్రాంతం మన సిద్దిపేట సకల దీక్షలకు మాలదారణ ప్రసిద్ధి గాంచిందన్నారు. అయ్యప్ప స్వామి కారణ జన్ముడు. ముల్లోకాలను ముప్పుతిప్పలు పెట్టిన మహిషి అనే రాక్షస మహిళను సంహరించి కోట్లాది మందికి దేవుడయ్యాడన్నారు. ఎక్కడో కేరళ రాష్ట్రంలోని 18 కొండల ఎగువన వెలసిన అయ్యప్ప స్వామి నేడు మన ఇంటి దేవుడుగా మారాడని, మహిమ, మహత్యం ఉన్నవారిని మనసుతో ఆరాధిస్తే అన్నీ సత్ఫలితాలే ఉంటాయనడానికి అయ్యప్ప పూజలే నిదర్శనమన్నారు. నియమనిష్టలకు, క్రమశిక్షణకు, ఆధ్యాత్మిక ప్రశాంతతకు అయ్యప్ప మాలధారణ పెట్టింది పేరని, ఉదయాన్నే 4 గంటలకు నిద్రలేచి సూర్యోదయానికి ముందే పూజలు , ఒంటి పుట భోజనం, నల్లటి దీక్షా వస్త్రాలు, కటిక నేలపై నిద్ర, రోజంతా స్వామివారి జపంతో 41 రోజుల పాటు మండల దీక్ష చేయడం ఆషామాషీ కాదన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే దీక్ష విరమణకు 80 కిలో మీటర్ల పెద్ద పాదం నడిచి శబరి వెళ్లడం మరో ఎత్తు. చిన్న పాదం నడకలోను మీకు ఎన్నో ఆటంకాలు ఉన్నా స్వామి దరి చేరుతున్నారు. సిద్దిపేట కు ఒక ప్రత్యేకత ఉంది. చాలా ప్రాంతాల్లో ఒక్కో దీక్ష మాత్రమే చేపడతారు. కానీ సిద్దిపేట హనుమాన్ దీక్షలో ఫస్ట్, అయ్యప్ప ధీక్షలో కూడా ఫస్టే, హనుమాన్ దీక్ష సమయంలో ఎటు చూసినా కాషాయ వస్త్రాలు ధరించిన స్వాములే కనిపిస్తారు. ఇప్పుడు పెద్ద సంఖ్యలో నల్ల వస్త్రాలు ధరించిన అయ్యప్ప స్వాములు దర్శన మిస్తున్నారు. ఇంకా దుర్గా మాత దీక్ష, గణేష్ దీక్ష, శివ దీక్ష, వేణుగోపాల స్వామి దీక్షలు కూడా పాటిస్తున్నారు. సిద్దిపేట ప్రజలు పూజించని దేవుడు లేడు, పాటించని దీక్ష లేదు అంటే అతిశయోక్తి కాదు. ఈ ఆధ్యాత్మికత వల్లనే నేడు సిద్దిపేట ప్రాంతం అభివృద్ధి లో విలసిల్లుతున్నాది. నిన్నటికి నిన్న 14 రోజుల పాటు కాల చక్ర యాగం కన్నుల పండుగగా నిర్వహించారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాలకు ఇచ్చినంత ప్రాధాన్యత ను దేశంలో మరే ముఖ్యమంత్రి కూడా ఇవ్వడు. సమైక్య పాలనలో చిన్నచూపునకు గురైన అలయాల్ని నేడు అద్భుతమైన రీతిలో కేసీఆర్ తీర్చిదిద్దుతున్నారు. ప్రాజెక్టులకు, జోన్లకు, జిల్లాలకు ఆలయాలు, దేవుళ్ల పేర్లు పెట్టిన ఘనత కూడా కేసీఆర్ దే అన్నారు.

# ఘనంగా మండల ఐక్య క్రిస్మస్

### క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చంటిబాబు, జ్యోతుల నెహ్రూ



**గోకవరం, డిసెంబర్ 8 (యదార్థవాది)** గోకవరం మండలం కృష్ణుని పాలెంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోకవరం మండల ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, వాక్యోపదేశలుగా బిషప్ విజయ్ రాజు హాజరయ్యారు. వాక్యప దేశకులు బిషప్ విజయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు అందరికీ దేవుడని కులమతాలకు అతీతంగా ఈ క్రిస్మస్ వేడుక అందరూ చేసుకోవాలని చెప్పారు.జ్యోతుల నెహ్రూమాట్లాడుతూ ఈ సంవత్సరంలో మొదటి క్రిస్మస్ సంబరాల్లో కృష్ణునిపాలెం లో పాల్గొనడం జరిగిందని, ఇక్కడ క్రిస్మస్ వాతావరణం నన్ను ఎంతగానో ఆనందంప చేసిందని గోకవరం మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే చంటిబాబు క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభకాంక్షలు తెలియజేస్తూ.. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ చలిని, మంచును కూడా లెక్కచేయకుండా ఎంతో ఆనందంగా క్రిస్మస్ జరుపుకోవడం నన్ను ఎంతో ఆనందింప చజేసిందని అన్నారు. అతి త్వరలోనే మీకందరికీ గోకవరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసే విధంగా చూస్తానని సభ ప్రాంగణంలో సభా ముఖంగా తెలియజేశారు. గతంలో శాసనసభ్యులుగా పని చేసినటువంటి మా పెదనాన్న జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేసిన స్థలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసి మీకందరికీ క్రిస్టియన్ కమ్యూనిటీ శాశ్వత భవనం ఏర్పాటు జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ జ్యోతుల చంటిబాబు విజయరాజు, కన్నబాబు, పాస్టర్స్ చేతుల మీదుగా కేకును కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుని ఆనందంగా క్రిస్మస్ వేడుక జరిపారు. ఈ కార్యక్రమంలో కన్నబాబు (ప్రశాంత్ కుమార్ హలొనెన్), జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ సెక్రెటరీ రెవ.రైమో జూహోని హలొనెన్, మండల్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రెవ.వరప్రసాద్, రెవ.విజయకుమార్, రెవ.మనోహర్, రెవ.జాన్, రెవ ప్రభుదాస్, రెవ.రాజు, గోకవరం మండలంలోని వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా విరాళాలు వెల్లువ

### గొర్రెలు అమ్మితే వచ్చిన డబ్బు బీఆర్ఎస్ పార్టీకి అందజేసిన జంపల్లి దుర్గయ్య, భారతవ్వ



**సిద్దిపేట, డిసెంబరు 08 (యదార్థవాది) :** ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ జాతీయ పార్టీకి మిట్టపల్లి గ్రామ ప్రజానికం మద్దతుగా భారీగా విరాళాలు అందజేసింది. మిట్టపల్లి గ్రామ శాఖ పార్టీ కార్యాలయం గురువారం మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా ఇచ్చిన రెండు గొర్రెలు సాకి పెద్దయ్యాక వాటికి పుట్టిన మరో రెండు గొర్రెలు అమ్మితే వచ్చిన డబ్బును సీఎం కేసీఆర్ దేశ ప్రధాని కావాలని ఆకాంక్షిస్తూ.. మిట్టపల్లి గ్రామానికి చెందిన జంపల్లి దుర్గయ్య-భారతవ్వలు రాష్ట్ర మంత్రి హరీశ్ రావుకు సంప్రదాయంగా గొంగడి కప్పి రూ.10,116 రూపాయలను బీఆర్ఎస్ పార్టీకి ఇవ్వాలని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జంపల్లి కుటుంబాన్ని అభినందించారు. అదే విధంగా గ్రామ టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీర్లపల్లి మల్లారెడ్డి సైతం సీఎం కేసీఆర్ దేశ ప్రధాని కావాలని కొనాయపల్లి వెంకన్నను మొక్కుతూ రూ.10,116 రూపాయలు మంత్రి హరీశ్ రావుకు అందజేశారు. అలాగే కేసీఆర్ దేశ ప్రధాని అయిన తర్వాత రూ.50, 116 రూపాయలు కూడా మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా అందజేస్తామని కొనాయపల్లి వెంకన్న మొక్కు చెల్లించుకుంటానని మాట ఇచ్చారు. మిట్టపల్లి గ్రామంలోని అర్బన్ మైనారిటీ ప్రెసిడెంట్ ఫయాసోద్దీన్ రూ.3016, నీల వెంకటయ్య ముదిరాజ్ రూ.2016, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ రూ.5వేలు, మిట్టపల్లి గౌడ సంఘం రూ.10,116, ముదిరాజ్ సంఘం రూ.1016, మిట్టపల్లి మహిళా సంఘాలు రూ.వెయ్యి, గొర్లషెడ్ల యాదవ సంఘం రూ.2011 రూపాయల చొప్పున బీఆర్ఎస్ పార్టీకి విరాళాలను మంత్రి హరీశ్ రావు చేతికి అందజేశారు.

# మన ఊరు మన బడి పనులు మార్చి చివరికి పూర్తి చేయాలి

### విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**నారాయణపేట డిసెంబర్ 8 (యదార్థవాది)** నారాయణ పేట జిల్లా రాష్ట్ర ముఖ్యమంత్రి మానస పుత్రిక ఆయిన మన ఊరు మన బడి-మన బస్తీ మన బడి కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రాష్ట విద్యా శాఖమంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మనఊరు మనబడి కార్యక్రమ అమలు పై సమీక్ష నిర్వహించారు. ఈ అందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఊరు మనబడి కింద మొదటి విడతలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌళిక సదుపాయాలు కల్పించి ప్రయివేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు మార్చి చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు ప్రతిమండలంలో 2 పాఠశాలలను మోడల్ స్కూల్‌గా ఎంచుకొని సకల సౌకర్యాలతో డిసెంబర్ చివరి కల్ల పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసుకోడానికి సిద్ధం చేయాలని సూచించారు. కొత్త ఫర్నిచర్ సైతం పంపించడం జరుగుతుందని, పాఠశాలల్లో పెయింటింగ్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి సుందరంగా పెయింటింగ్ వేయించాలన్నారు. సోలార్ ఫ్యాన్ లు సైతం మొదటి విడతలో 500 పైచిలుకు పాఠశాలలకు పంపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పాఠశాలల పరిశుభ్రత, నిర్వహణ కింద రాబోయే 5 నెలలకు 130 కోట్లు నిధులు విడుదల చేయడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో లైబ్రరీ రూమ్ ఏర్పాటు కు పుస్తకాలు చేయించడం జరుగుతుందని ఒక్కో జిల్లా నుండి కనీసం 150నుండి 250పాఠశాలల వరకు ఎంపిక చేసి పెట్టుకోవాల్సిందిగా తెలియజేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో మొదటి విడతలో చేపట్టిన 168 ప్రభుత్వ పాటశాలలకు గాను 141 పాఠశాలలు 30 లక్షల కన్నా తక్కువ బడ్జెట్ పరిధిలో ఉన్నాయని వాటిలో పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. వాటిని సకాకంలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి మండలం నుండి 2 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్ది ప్రారంభోత్సవానికి డిసెంబర్ చివరి లోపు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీ రూమ్ ఏర్పాటుకు ఇప్పటికే పాఠశాలలు గుర్తించడం జరిగిందన్నారు.

# పైప్ లైన్ పనులకు శంకుస్థాపన



**జూబ్లీహిల్స్, డిసెంబర్ 8 (యదార్థవాది) :** తెలంగాణ రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శ్రీనగర్ కాలనీ డివిజన్ శాలివాహన నగర్‌లో గురువారం నాలుగు లక్షల రూపాయలతో నిర్మిస్తున్న వాటర్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్తానిక కార్పొరేటర్ సంగీత యాదవ్ కాలనీ సభ్యులు మూర్తి, రవి, డివిజన్ అధ్యక్షులు అప్పు ఖాన్, తన్ను ఖాన్ మధు, చిన్న బాబు వార్డ్ సభ్యులు ఏరియా సభ్యులు, తెరాస పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సర్వేయర్ అప్రోచ్ రీ సర్వేపై అవగాహన



**చిలకలూరిపేట, డిసెంబర్ 8 (యదార్థవాది) :** నియోజకవర్గం లోని పట్టణ, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సేవలను తాత్కాలిక ప్రాతిపదికన రీసర్వే విధులకు వినియోగిస్తున్నట్లు తాసిల్దర్ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు అనిమెంటరీ సెక్రటరీ, పంచాయతీ సెక్రెటరీ లను నియమించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా గురువారం మండల సర్వేయర్, డిప్యూటీ తాసిల్దారు గ్రామ సర్వేయర్ అప్రోచ్ రీ సర్వేపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటింటా రామాయణ గ్రంథం వితరణ



**గోకవరం, డిసెంబర్ 8 (యదార్థవాది) :** గోకవరం మండలం గోపాలపురం గ్రామం స్థానిక మాతృ శ్రీ బాపనమ్మ గుడి ప్రాంగణంలో సనాతన ధర్మ ప్రబోధనా సమితి యువజన శాఖ సభ్యుడు గూడవల్లి సతీష్ ఆధ్వర్యంలో కీ"శే రాచగిరి వెంకయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రాచగిరి మిథిల రవిచంద్రబాబు దంపతుల ఆర్థిక సహాయంతో ఇంటింటా రామాయణ గ్రంథ వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ తోట సాయిబాబు మాట్లాడుతూ ఏ ఇంట రామాయణ గ్రంథం శ్రద్ధతో పారాయణ చేయబడుతుందో ఆ ఇంట సర్వ అరిష్టాలు నశించడంతో పాటుగా సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని అన్నారు.మేడా వసుంధర చేతుల మీదుగా రామాయణ గ్రంథాలను గ్రామస్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆవూరి బంగారమ్మ,తుపాకుల ఆనందరావు, కుక్కప్రభావతి, పిల్లంగోరు పాపారావు,సుగ్రబోయిన సీతయ్య, పీతాగుణలక్ష్మి, కాంద్రేగుల కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన పవన్ దుర్గాప్రసాద్



**గోకవరం, డిసెంబర్ 8 (యదార్థవాది) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గోకవరం మండలంలోని పెంటపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 8వ తరగతి విద్యార్థి చేన్నిబోయిన పవన్ దుర్గాప్రసాద్ కాకినాడ డి.ఎస్.డి.ఏలో జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏలమర్తి వెంకన్న తెలిపారు గురువారం వెంకన్న ఆధ్వర్యంలో పాఠశాల లో పవన్ దుర్గప్రసాద్ ని గోకవరం మండలం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు అభినందించారు. ఈసందర్భంగాఎంపీపీ పవన్ దుర్గాప్రసాద్ కి 500 రూపాయలు నగదు, ఖరీదైన పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని పవన్ దుర్గాప్రసాద్ ని అభినందించారు ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సుంకర వెంకటరమణ పి ఎం సి చైర్మన్ గుర్రం దుర్గాప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ ఎం ప్రసన్న శివ మాజీ సర్పంచ్ శివరామకృష్ణ ఎంపీటీసీ గండికోట వెంకటరమణ రామకృష్ణ నక్క పాండురంగ రామాంజనేయులు ఉపాధ్యాయులు నాగేంద్రబాబు, జగదీష్ పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా



**హిమాయత్ నగర్, డిసెంబర్ 8(యదార్థ వాది) :** బహిరంగ ప్రాంతాల్లో, రోడ్లపై చెత్తాచెదారం వేస్తే జరిమానా తప్పదని జిహెచ్ఎంసి సర్కిల్-16 ఏఎంహెచ్ఓ జ్యోతిబాయ్ అన్నారు. గురువారం హిమాయత్ నగర్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇండ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలని సూచించారు. రోడ్లపై, బహిరంగ ప్రాంతాల్లో వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

PRINTER, PUBLISHER, EDITOR AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, Printed at MEGHA Printers, H.No.11-52, Indira Nagar, Siddipet - 502 103. E-mail: yaadharthavaadhi@gmail.com
TEL TEL No.: 02022 # 11-52, INDRA NAGAR, PRASHANTH NAGAR, SIDDIPET - 502 103. PUBLISHED FROM: HO # 1-3-183/40/46/29, GANDHI NAGAR, HYDERABAD - 500 080.